# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-2 3, ఆగష్టు, 2015

తెలంగాణలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి కోసం పిలిచిన టెండర్లకు అనూహ్య స్పందన లభించింది. రెండు నెలల క్రితం 2000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కోసం పిలిచిన టెండర్లను సోమవారం తెరిచారు. తాజా పరిణామంతో దేశంలోనే ఎక్కువ సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసే రాష్ట్రంగా తెలంగాణ నిలవబోతున్నది. టెండర్లు తెరిచిన అనంతరం విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి, విద్యుత్ శాఖ కార్యదర్శి అరవింద్ కుమార్, జెన్కో సిఎండి ప్రభాకర్ రావు, సిపిడిసిఎల్ సిఎండి రఘుమారెడ్డి తదితరులు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావుతో సెక్రటేరియట్‌లో సమావేశమయ్యారు. మొత్తం 2000 మెగావాట్ల కోసం టెండర్లు పిలవగా 184 కంపెనీలు తెలంగాణలో విద్యుత్ ప్లాంట్లు పెట్టడానికి ముందుకొచ్చాయి. అనేక కంపెనీలు పోటీపడినప్పటికీ అర్హతలు ఉన్న కంపెనీల ఫైనాన్షియల్ బిడ్లను మాత్రమే పరిగణలోకి తీసుకున్నారు. దీని ప్రకారం తెలంగాణ వ్యాప్తంగా 4623 మెగావాట్ల సామర్థ్యం కలిగిన సౌర విద్యుత్ కేంద్రాల స్థాపనకు యూనిట్‌కు రూ. 5.17 పైసల కనిష్ట ధరతో టెండర్లు వచ్చాయి. ప్రభుత్వం 2000 మెగావాట్లకు టెండర్లు పిలిస్తే ఎక్కువ మెగావాట్ల విద్యుత్ ప్లాంట్లకు టెండర్లు రావడంతో సోలార్ ప్లాంట్ల సంఖ్యను కూడా పెంచాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అధికారులను ఆదేశించారు. టెండర్లు ఖరారయిన కంపెనీలతో పవర్ పర్చేజ్ అగ్రిమెంట్లు కుదుర్చుకోవడానికి అవసరమైన విధి విధానాలు రూపొందించాలని ముఖ్యమంత్రి కేసిఆర్ అధికారులకు సూచించారు. గత ఏడాది జూన్‌లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొద్ది సమయంలోనే సోలార్ విద్యుత్ కోసం టెండర్లు పిలిచి 800 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్నది. ప్రస్తుతం ఆ ప్లాంట్లు నిర్మాణ దశలో వున్నాయి. వీటి ద్వారా వచ్చే ఏడాది మార్చి నాటికి విద్యుత్ అందుబాటులోకి వస్తుంది. ప్రస్తుతం ఖరారు చేయబోయే ప్లాంట్ల ద్వారా మరో ఏడాది కాలానికి విద్యుత్ అందుబాటులోకి వస్తుంది. దీంతో సోలార్ విద్యుత్‌ను ఎక్కువగా ఉత్పత్తి చేసే రాష్ట్రాల్లో తెలంగాణ నెంబర్ వన్ గా మారుతుంది. రైతులకు పగటి పూట 9 గంటల పాటు విద్యుత్ అందించే ప్రణాళికకు సోలార్ విద్యుత్ ఉత్పత్తి పెంచుకునే చర్యలు దోహదపడతాయని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

---

సిపిఆర్ఓ టు సిఎం